సాక్షి
హనుమకొండ

సోమవారం | 7 | అక్టోబర్ | 2024



అథ్లెటిక్స్ ఆణిముత్యాలు..
ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు చదువుతో పాటు అథ్లెటిక్స్‌లోనూ రాణిస్తున్నారు. - 8లో▸



తల్లులకు తీరని శోకం
పిడుగుపాటుకు కన్నతల్లుల కళ్లెదుటే ఇద్దరు పిల్లలు విగతజీవులయ్యారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా వెంకటాపురం గ్రామంలో చోటు చేసుకుంది. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $32^0/23^0$
ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయి. సాయంత్రం ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

ట్రస్ట్‌ల ఏర్పాటుకు నోటీసులు

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వర, రంగనాథస్వామి పురాతన దేవాలయాల్లో ట్రస్ట్ కమిటీల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎండోమెంట్ అధికారులు నోటీసులు పంపించారు. ఈమేరకు ఆలయాల ముఖ ద్వారాల్లో వాటిని అంటించారు. దేవాదాయ కమిషనర్ ద్వారా ఐదుగురు సభ్యులతో ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు, ఎవరైనా వ్యవస్థాపక సభ్యులు ఉంటే ట్రస్ట్‌లో మెంబర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. నోటీసు అంటించిన రోజు నుంచి 20 రోజుల్లోపు సూచించిన ఫార్మాట్‌లో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ వరంగల్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ రెండు దేవాలయాలను కాశిబుగ్గకు చెందిన అభివృద్ధి కమిటీల ద్వారా నిర్వహిస్తున్నారు. దీంతో దేవాలయాలపై తమ పెత్తనం పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్తే అభివృద్ధి జరగదని కొందరు అంటున్నారు. ఈ నోటీసుల వెనుక రాజకీయ నేతల హస్తం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

18 నుంచి ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మొదటి పేపర్ 18న, రెండో పేపర్ 22, మూడో పేపర్ 24, నాలుగో పేపర్ 26న ఉంటుందని, ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడాలని తెలిపారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర వ్యాప్తంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈవేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలను కోరారు.

నేటితో రైల్వే 'మెగా బ్లాక్' ముగింపు

కాజీపేట రూరల్: కాజీపేట టౌన్, హసన్‌పర్తి, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు గత నెల 22న చేపట్టిన చేపట్టిన అతి పెద్ద రైల్వే ఇంజనీరింగ్ 'మెగా బ్లాక్' పనులు సోమవారంతో ముగియనున్నాయి. హసన్‌పర్తి–కాజీపేట వరకు, కాజీపేట–వరంగల్ వరకు ప్రస్తుతం ఉన్న రెండు లైన్లకు తోడుగా మరో రెండు లైన్ల నిర్మాణం చేపట్టారు. గతంలో కాజీపేట ఫాతి మానగర్ కార్డులైన్ మీదుగా వయా వరంగల్ నుంచి బల్లార్షా–విజయవాడ రూట్‌లో ప్రయాణించే రైళ్లు.. సిగ్నల్ క్లియరన్స్ లేక కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్‌లో ఆపేవారు. ఇప్పుడు కొత్త లైన్ల నిర్మాణంతో రైళ్ల ట్రాఫిక్ ఉండదని అధికారులు చెబుతున్నారు. కాగా రైల్వే బ్లాక్‌లో మూడో రైల్వే లైన్, బైపాస్ లైన్, కోమటిపల్లి వద్ద రైల్వే సొరంగ మార్గం నిర్మించినట్లు పేర్కొన్న రైల్వే అధికారులు.. అన్ని విధాలుగా ట్రాక్‌ఫిట్ అయిన తర్వాత ట్రయల్ రన్ నిర్వహించి కొత్త లైన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు.

'హైడ్రా' బాధితులకు పరిహారం చెల్లించాలి



వేలేరు: హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన పేదల ఇళ్లకు వెంటనే నష్టపరిహారం చెల్లించి బాధితులకు ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఇళ్ల నిర్మాణానికి, విద్యుత్, నల్లా కనెక్షన్లు ఇతర అనుమతులు ఇచ్చిన అధికాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హైడ్రా బాధితులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. రాజు, కిరణ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

ఏడుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హసన్‌పర్తి: పోలీస్ కమిషనరేట్ పరిధి వివిధ పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న ఏడుగురిని బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎ.మహేందర్ సీసీఎస్ నుంచి గీసుకొండ, జి.బాబులాల్ గీసుకొండ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎస్.రవికుమార్ టాస్క్‌ఫోర్స్ నుంచి కేయూసీ, బి.సంజీవ కేయూసీ నుంచి సీఎస్‌బీ, ఓ.రమేశ్ సీసీఎస్ నుంచి మామునూరు, ఎం.రవికుమార్ మామునూరు నుంచి ఐజీపీ మల్టీజోన్–1, ఎస్.శివకుమార్ ఇంతేజార్‌గంజ్ నుంచి సీసీబీకి బదిలీ అయ్యారు.

● కరెన్సీతో అభిషేకం



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్ శివనగర్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీలలితాదేవి అమ్మవారికి రూ.11లక్షల కాయిన్స్‌తో అభిషేకం నిర్వహించారు. అనంతరం రూ.2లక్షల కరెన్సీ నోట్లతో శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. పూజారి వెంకటేశ్వరాచార్యులు ఆధ్వర్యాన ఆలయ అభివృద్ధి కమిటీ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచాల కృష్ణమూర్తి, రావికంటి అశోక్, శ్రీరాం రాజేశ్, ఆడెపు శ్యాంసుందర్, నవీన్, భక్తులు పాల్గొన్నారు.

– ఖిలా వరంగల్

● మహాలక్ష్మిగా..

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్ శ్రీభద్రకాళి అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. ఉత్సవమూర్తిని ఉదయం కూష్మాండ, సాయంత్రం గిరిజా క్రమాల్లో పూజించి సూర్యప్రభ, హంసవాహనాలపై ఊరేగించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. రుద్రేశ్వరాలయంలో శ్రీరుద్రేశ్వరీ అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా, ఐనవోలులో భ్రమరాంబిక అమ్మవారిని కూష్మాండదుర్గగా అలంకరించారు.

– హన్మకొండ కల్చరల్



భద్రకాళి ఆలయంలో హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు..



రుద్రేశ్వరాలయంలో ఉత్సవమూర్తికి మహాలక్ష్మీదేవి అలంకరణ..



ఐనవోలు : కూష్మాండదుర్గ అలంకరణలో భ్రమరాంబిక అమ్మవారు..

బిగుస్తున్న ఉచ్చు!?

కాళేశ్వరం ప్రాజెక్టు మాజీ ఈఎన్‌సీ, ఇంజినీర్లలో దడ..

- 'జస్టిస్ ఘోష్ కమిషన్' ఎంక్వైరీ మళ్లీ మొదలు
- నేడు విచారణకు మరికొందరు
- ఈఈ, డీఈఈలు, ఏఈఈలకు కూడా..?
- ప్రాజెక్టుపై అన్ని కోణాల్లో ఆరా..
- మరోవైపు అక్రమాస్తులపైనా 'ఏసీబీ' నజర్



ఇంజినీరింగ్ వర్గాల్లో 'విచారణ' కలకలం..

కాళేశ్వరం ఎత్తిపోతలపై న్యాయ విచారణ కమిషన్ దూకుడు పెంచడం ఇంజినీరింగ్ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇప్పటికే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి సాంకేతిక అంశాలపై పలు కోణాల్లో విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. ఈ పథకంలో భాగంగా నిర్మించిన లక్ష్మీ, సరస్వతి, పార్వతి పంప్‌హౌస్‌లు వరద నీటిలో మునగడానికి కారణాలపై మళ్లీ దృష్టి సారించింది. ఈఎన్సీ (జనరల్), ఈఎన్సీ (ఓ అండ్ ఎం), రామగుండం సీఈ, కమిషనర్ ఆఫ్ డిజైన్స్ సీఈ, క్వాలిటీ కంట్రోల్ సీఈల ద్వారా ఆరా తీయడం చర్చనీయాంశంగా మారింది. అలాగే, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపొందించిన ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ–గజ్వేల్) హరీరాం, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (ఈఎన్సీ–జనరల్ కార్యాలయం) పి.పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్ చీఫ్ ఫణిభూషణ్‌శర్మ తోపాటు మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును నాలుగు రోజులు పలు అంశాలపై కమిషన్ విచారించింది. నిధుల సమీకరణ, ఖర్చు, ఆడిట్ తదితర అంశాలపై చర్చించిన కమిషన్.. మేడిగడ్డ సహా అన్ని చోట్ల జరిగిన పనుల్లో పాలుపంచుకున్న వివిధ కేడర్ల అధికారులను సైతం విచారించనుందన్న చర్చ ఇంజినీరింగ్ వర్గాల్లో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

సాక్షిప్రతినిధి, వరంగల్ :

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో పాలు పంచుకున్న కొందరు మాజీ ఈఎన్‌సీ, సీఈ, ఎస్‌ఈలకు ఉచ్చు బిగుస్తోంది. సెప్టెంబర్ చివరి వారంలో వారం పాటు అన్ని కేడర్లకు చెందిన అధికారులను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. ఈ సందర్భంగా కమిషన్ ప్రశ్నలకు ఉక్కిరి బిక్కిరైన కొందరు అధికారులు ఏం చెప్పాలో తెలియక తికమకపడ్డారు. నాలుగు రోజుల విరామం తర్వాత కమిషన్ మళ్లీ విచారణకు పిలుస్తున్నది. సోమవారం కూడా సుమారు 12 మందిని విచారించనున్నట్లు ప్రకటించింది. దీంతో పలువురు ఇంజినీర్లలో దడ మొదలైంది. ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ), చీఫ్ ఇంజినీర్ (సీఈ), సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ)లకే పరిమితం అవుతుందనుకున్న కమిషన్ విచారణ.. కిందిస్థాయి ఇంజినీర్లను కూడా తాకుతుండటం ఆ వర్గాల్లో ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే పనిపూర్తయినట్లు ఇచ్చిన పత్రాలను వాపసు తీసుకోవడంతోపాటు బ్యాంకు గ్యారంటీలు, కాంట్రాక్టు ఏజెన్సీలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వడం కలకలం రేపుతోంది. రిటైర్డ్ ఈఎన్‌సీలను వరుసగా మూడు రోజులు విచారించడం సంచలనంగా మారింది. ఇదే క్రమంలో అవసరమైతే కాళేశ్వరం ప్రాజెక్టు కీలక ప్యాకేజీల్లో పాలు పంచుకున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను విచారించే అవకాశం లేకపోలేదంటున్నారు. దీంతో అప్పటి ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు డైరెక్షన్‌లో చేయకూడని పనులు చేసిన కొందరు ఇంజినీర్లలో దడ మొదలైంది.

అంతా మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు చుట్టే..?

ప్రాజెక్టు నిర్మాణం సమయంలో చీఫ్ ఇంజినీర్‌గా ఉండి.. ఈఎన్‌సీ వరకు ఎదిగి, ఉద్యోగ విరమణ పొందినా ఎక్స్‌టెన్షన్‌పై పనిచేసి అన్నీ తానై వ్యవహరించిన మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు చుట్టూనే అంతా తిరుగుతోంది. అందుకు కారణం కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తికాకముందే.. ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ద్వారా గుండెజబ్బు బాధితులని తెలిసినా కొందరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల నుంచి బలవంతంగా ప్రాజెక్టు పూర్తయినట్లు సర్టిఫికెట్లు జారీ చేయించడమే. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ కూడా ముగిసిందని, పని పూర్తయినట్లు 2021 మార్చి 15న సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధ్రువీకరణ పత్రం ఇవ్వడం, దానిపై ఎస్‌ఈ కౌంటర్ సంతకం చేయడం వెనుక వెంకటేశ్వర్లు పాత్ర ఉన్నట్లు కూడా తేలింది.

అంతకుముందు 2020 ఫిబ్రవరి 29నే పనిపూర్తయిందని, ప్రభుత్వం వద్ద ఉన్న బ్యాంకు గ్యారంటీలను వెనక్కి ఇవ్వాలన్న సిఫారసులపైన విచారణ జరుగుతోంది. కాగా, ఈ ప్రాజెక్టు నిర్మాణం సమయంలో తలెత్తిన లోపాలు, కీలక ఘట్టాలను బయటకు తెలవకుండా ఈఎన్‌సీగా ఉన్న సమయంలో నల్లా వెంకటేశ్వర్లు మౌఖిక ఆదేశాల మేరకు నిబంధనలకు మంగళం పాడిన ఇంజినీర్లు సైతం విచారణను ఎదుర్కోక తప్పదంటున్నారు. ఇదే సమయంలో మరోవైపు ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్న కొందరు ఇంజినీర్లపైనా ఏసీబీ ఆరా తీస్తుందన్న ప్రచారం ఆందోళన కలిగిస్తోంది.

బదిలీల్లో అడ్డదారులు!

ప్రొటెక్షన్ కోసం విద్యుత్ ఉద్యోగుల వెంపర్లాట

- అప్పటికప్పుడు పదవీయోగం
- పని చేసిన చోటే ఉండేందుకు..
- అక్రమాలకు పాల్పడితే చర్యలు : యాజమాన్యం
- ఎన్పీడీసీఎల్‌లో నేడు బదిలీల ఉత్తర్వులు



హన్మకొండ: బదిలీల్లో అనుకున్న పోస్టులు సాధించుకోవడానికి విద్యుత్ ఉద్యోగులు అడ్డదారులు తొక్కుతున్నారని చర్చ జరుగుతోంది. టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఒకే పోస్టులో రెండేళ్లు పూర్తి చేసుకున్న వారిలో 50శాతం వరకు బదిలీలు చేయాలని నిర్ణయం తీసుకుని యాజమాన్యం షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఈనెల 7న బదిలీ ఉత్తర్వులు అందించాల్సి ఉంది. ఈక్రమంలో ప్రధాన పోస్టులు, ఫోకల్ పోస్టులు సాధించుకునేందుకు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

ప్రొటెక్షన్ కోసం పాకులాట

ప్రొటెక్షన్ కోసం విద్యుత్ ఉద్యోగులు వెంపర్లాడుతున్నారు. ప్రధాన యూనియన్లకు చెందిన కొందరు ఉద్యోగులు చిన్న యూనియన్లు, వెల్ఫేర్ అసోషియేషన్ల నుంచి అప్పటికప్పుడు ప్రొటెక్షన్ కోసం పదవీయోగం పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ ఉద్యోగుల యూనియన్లు, ఇంజినీర్ల అసోషియేషన్లు, ఆయా వెల్ఫేర్ అసోషియేషన్లకు చెందిన అధ్యక్షుడు, కార్యదర్శిలో ఎవరైనా ఒకరు ఎన్పీడీసీఎల్ కంపెనీ స్థాయిలో, సర్కిల్ స్థాయిలో ప్రొటెక్షన్ పొందొచ్చని బదిలీ నిబంధనల్లో స్పష్టంగా పొందుపర్చారు. దీన్ని అతిక్రమించి అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని పేర్కొన్నారు. అయినప్పటికీ తమకు నచ్చిన పోస్టులను పొందడానికి ప్రొటెక్షన్ కోసం చిన్న చిన్న యూనియన్లు, ఆయా వెల్ఫేర్ అసోషియేషన్ల తలుపు తడుతున్నారని తెలిసింది. ఈ అంశంపై విద్యుత్ ఉద్యోగులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

నిబంధనలకు నీళ్లు!

రెండేళ్ల కాలపరిమితి పూర్తి చేసుకున్న వారు ట్రాన్స్‌ఫర్ కావాల్సిందేనని నిబంధనలు చెబుతున్నా.. ప్రస్తుతం పని చేస్తున్న హెడ్‌క్వార్టర్‌లోనే ప్రధానంగా జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో ఉండేందుకు ప్రొటెక్షన్ ద్వారా లబ్ధిపొందేందుకు కొందరు తాపత్రయపడుతున్నారు. మరో వైపు ఫోకల్ పోస్టుల భర్తీలో వెల్ఫేర్ అసోషియేషన్‌కు చెందిన ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆయా అసోసియేషన్ల నాయకులు మొత్తుకుంటున్నారు. అలాగే పోస్టులు తమకు చెందినవని ఆయా యూనియన్లు చెప్పుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు ఆప్షన్ల ప్రకారం చేస్తామని చెప్పినా పోస్టులు తమ యూనియన్లకు చెందినవని, అవి తమ యూనియన్ సభ్యులుగా ఉన్న ఉద్యోగులతోనే భర్తీ చేయాలని ఒత్తిడి పెంచడాన్ని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు ఖండిస్తున్నారు. అలాంటప్పుడు ఉద్యోగుల నుంచి ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లు ఎందుకు అడిగారని ప్రశ్నిస్తున్నారు. బదిలీల నోటిఫికేషన్‌లో పొందుపర్చిన నిబంధనలు కచ్చితంగా పాటించి బదిలీలు చేపట్టాలని కోరారు.

ఆత్మకూరు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా సునంద



ఆత్మకూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గుడెప్పాడ్‌కు చెందిన బీరం సునంద–సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వైస్ చైర్మన్‌గా తంగళ్లపల్లి తిరుపతి నియమితులయ్యారు. కాడబోయిన రమేశ్‌యాదవ్, పిట్టల రాజేందర్, షేక్ నవీర్, సోనబోయిన రవి, దామెర చక్రయ్య, లక్కిడి సుజాత, ముంద్రాతి భిక్షపతి, పల్లె దయాకర్, గొరు రాజిరెడ్డి, జాడి రాజీవ్‌గాంధీ, పాడి గణపతిరెడ్డి, భానుప్రకాశ్‌ను సభ్యులుగా నియమించినట్లు తెలిపారు. చైర్‌పర్సన్‌గా నియమితులైన బీరం సునంద సుధాకర్‌రెడ్డి 2001 నుంచి 2006 వరకు గుడెప్పాడ్ సర్పంచ్‌గా, 2006 నుంచి 2011 వరకు ఆత్మకూరు ఎంపీపీగా పనిచేశారు. తాజాగా సునందకు నామినేటెడ్ పదవి దక్కింది. కాగా.. ఆదివారం బీరం సునంద సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

పేద అనాథ పిల్లలకు బాలవికాస అండ

- వ్యవస్థాపకురాలు బాలథెరిసా జింగ్రాస్




పిల్లలతో ఆర్థిక సహాయం అందించిన దాతలు

కాజీపేట రూరల్: పేద అనాథ పిల్లలకు బాలవికాస అండగా నిలుస్తోందని బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిసా జింగ్రాస్ అన్నారు. కాజీపేట బాలవికాస ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన వార్షిక సదస్సులో అర్బన్ సాలిడారిటీ క్లబ్, సోపార్ సహకారంతో 102 మంది అనాథలకు సుమారు రూ.17 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఆన్‌లైన్‌లో పాల్గొన్న బాలథెరిసా జింగ్రాస్ మాట్లాడుతూ నేటి యువత చదువుతో పాటు విలువలతో కూడిన జీవితం కోసం ప్రయాసపడాలన్నారు. సంస్థ కోశాధికారి రమణగుప్తా మాట్లాడుతూ.. 85 శాతానికి పైగా మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున అదనపు స్కాలర్‌షిప్ దాతల సహాయంతో అందజేసినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ లత, దాతలు రఘురామ్‌రెడ్డి, ఎం.ఎస్.వెంకటేశ్వరరావు, బి.వి.సురేశ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, బి.అప్పారావు పాల్గొన్నారు. జనవికాస సహకారంతో అనాథ పిల్లలకు రూ.5లక్షల విలువైన కిరాణా సరుకులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. శోభా సింగారెడ్డి, సురేశ్‌రెడ్డి, డాక్టర్ హరీశ్, లూర్ధుమర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ

- 10 రోజుల క్రితం ఇక్కడి సీఐ మల్లయ్య బదిలీ
- స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓను నియమించని అధికారులు
- వెనుదిరిగిపోతున్న ఫిర్యాదుదారులు



మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోనే ఎక్కువ పరిధి ఉన్న పోలీస్‌స్టేషన్‌గా మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు గుర్తింపు ఉంది. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్యను ఐజీకి అటాచ్ చేస్తూ పది రోజుల క్రితం బదిలీ వేటు వేశారు. ఇంతవరకు ఇన్‌స్పెక్టర్‌ను నియమించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ స్టేషన్ పరిధిలో సుమారు 2 లక్షలకు పైగా జనాభా ఉంటుంది. నిత్యం భూఆక్రమణలు, అల్లర్లు, అసాంఘిక శక్తుల ఆగడాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమస్యలపై అనేక మంది బాధితులు స్టేషన్‌కు వస్తారు. ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో ఫిర్యాదుదారులు వెనుదిరిగిపోతున్నారు. బెల్ట్‌షాపులు, నిషేధిత గుట్కాల అమ్మకాలు, ఆన్‌లైన్ సట్టా, పేకాట స్థావరాలపై స్థానిక పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేస్తున్నా నిర్వాహకుల తీరు మారడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆదివారం జరిగిన ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లోనూ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు ఎవరినీ నియమించలేదు. సీపీ స్పందించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా ఎస్‌హెచ్‌ఓను వెంటనే నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

గుట్టుగా సట్టా.. మట్కా

అడ్డా కూలీలు, చిరువ్యాపారులు, ఆటోడ్రైవర్లే వారి టార్గెట్. ఆన్‌లైన్ వేదికగా.. అమాయకులకు వల వేస్తారు. ఈ బెట్టింగ్ వ్యవహారంలో ఎంతటివారైనా డబ్బులు పోగొట్టుకోవాల్సిందే తప్ప లాభపడింది ఎవరూ లేరు. ఇంత జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. – వరంగల్ క్రైం

అడ్డా కూలీలు, చిరువ్యాపారులు, ఆటోడ్రైవర్లే టార్గెట్

- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- పట్టించుకోని స్థానిక పోలీసులు
- చాపకింద నీరులా ఆన్‌లైన్ దందా



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సట్టా.. మట్కా చాప కింద నీరులా సాగుతోంది. నిర్వాహకులపై వరుస దాడులు జరుగుతున్నా.. తమ అనుచరులు, ఏజెంట్లను పెట్టుకుని దందా కొనసాగిస్తుండడంతో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ దందాకు సోషల్ మీడియాను అనుకూలంగా మలుచుకుని నిర్వహిస్తుండడంతో వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో సట్టా, మట్కా వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా మాస్ జనం ఎక్కువగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకుని అక్కడ గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా నడుపుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సరైన దృష్టిసారించకపోవడంతో ఈ అక్రమ వ్యాపారం విస్తరిస్తోంది.

అడ్డా కూలీలే టార్గెట్..


సట్టా, మట్కా నిర్వాహకులు రోజువారీ అడ్డా కూలీలు, ఆటోడ్రైవర్లు, చిరు వ్యాపారులను టార్గెట్ చేసుకుని దందా చేస్తున్నారు. తక్కువ డబ్బులతో ఎక్కువ సంపాదించవచ్చనే ఆశ చూపి డబ్బులు కట్టించుకుంటున్నారు. వారి మాటలు నమ్మి రోజంతా కాయకష్టం చేసి సంపాదించిన డబ్బులను సట్టా, మట్కాలో పెట్టి మోసపోతున్నారు. ఇలా చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మోసపోతున్నవారిలో చాలా మంది కూలీలే కాబట్టి ఈ దందా వెలుగు చూడడం లేదు. సట్టా, మట్కా నిర్వాహకుల జాబితా స్థానిక పోలీసులకు తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు దందా అంతా ఆన్‌లైన్ వేదికగా జరుగుతుండడంతో బాధితులు ఒకరిని ఒకరు కలిసే అవకాశం లేకుండా పోయింది.

దందా జరుగుతోందిలా..

ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సింగిల్,డబుల్ డిజిట్‌పై సట్టా, మట్కా నిర్వహిస్తున్నారు.నంబర్లపై బెట్టింగ్ పెట్టిన తర్వాత వెబ్‌సైట్‌లో సాయంత్రం రిజల్ట్ ప్రకటిస్తారు. ఏజెంట్‌గా వ్యవహరించే వారు డబ్బులు వసూల్ చేసి.. వచ్చిన వారికి చెల్లిస్తారు. అయితే ఎక్కువ శాతం ఇక్కడ డబ్బులు పోవడం తప్ప వచ్చిన దాఖలాలు లేవని బాధితులు చెబుతున్నారు.

ఇటీవలి ఘటనలు కొన్ని..

- సెప్టెంబర్ 19న స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సట్టా, మట్కా నిర్వహిస్తున్న ఇల్లందుల యాకయ్యను అదుపులోకి తీసుకుని నిందితుడి నుంచి రూ.1,000 నగదు, ఒక సెల్‌ఫోన్ మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు.
- సెప్టెంబర్ 17న మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రిస్టియన్ కాలనీకి చెందిన గద్దల శ్రీలత మట్కా నిర్వహిస్తుండగా పట్టుకుని ఆమె నుంచి రూ.24,100 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.
- హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధి లోటస్ కాలనీలో సట్టా,మట్కా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఉప్పుల కృష్ణను గత నెల 11న పట్టుకుని అతడి నుంచి రూ.40,100నగదు,ఒక సెల్‌ఫోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న నగదు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు(ఫైల్)

- మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 9న టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో సట్టా, మట్కా నిర్వాహకుడు ఉర్సు ప్రాంతానికి చెందిన గుజారీ కిరణ్ పట్టుబడ్డాడు. అతడి నుంచి రూ.4,000, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇదే రోజు గీసుకొండ పోలీస్‌స్టేషన్ పరిధి ఖిలా వరంగల్‌కు చెందిన ఖమ్మని హరీశ్ పట్టుబడ్డాడు. అతడి నుంచి రూ.5,100 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.
- గత నెల 6న వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధి నల్లబెల్లిలో సట్టా, మట్కా నిర్వహిస్తుండగా.. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన ఎండీ.యాకుబ్‌ను అరెస్ట్ చేసి రూ.33,150 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
- సెప్టెంబర్ 5న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి శాంతినగర్‌కు చెందిన బండి రాజు సట్టా, మట్కా నిర్వహిస్తుండగా.. అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.32,730నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఆగస్టు 31న కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాల్‌పూర్‌లో సట్టా నిర్వాహకుడు జనగాని సురేశ్‌ను అదుపులోకి తీసుకుని రూ.10,200 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సుకన్యకు రజతం

● దక్షిణాఫ్రికాలో మెరిసిన గిరిజన ఆణిముత్యం



రజత పతకం సాధించిన సుకన్య

కురవి: దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో జరుగుతున్న కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా ఉమ్మడి కురవి మండలం సీరోలు శివారు రేకుల తండా జీపీ పరిధిలోని జగ్యాతండాకు చెందిన గిరిజన యువతి తేజావత్ సుకన్యకు రజతపతకం లభించింది. దక్షిణాఫ్రికాలో ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకు జరుగుతున్న పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిథ్యం వహిస్తున్న తెలంగాణ తేజం తేజావత్ సుకన్య 76 కేజీల విభాగం పోటీలో పాల్గొంది. ఈ పోటీలో భారతదేశానికి చెందిన బీఎం వైశాలి మొదటి స్థానంలో నిలిచింది. సుకన్య ద్వితీయ స్థానంలో నిలిచి రజతపతకం సాధించగా, నార్త్ ఐర్లాండ్‌కు చెందిన బెల్‌ఎలినా మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా తేజావత్ సుకన్య ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గ్రీన్‌కో గ్రూపు సీఎండీ అనిల్‌కుమార్ చలమలశెట్టి సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని తెలిపారు.

పిడుగు పడి ఇంజనీర్‌కు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఇంజనీర్ సింగారం

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలో గ్రీన్ ఫీల్డ్ హైవే ఇంజనీర్ ఆర్.సింగారం పిడుగుపాటుకు తీవ్రంగా గాయపడ్డాడు. తమిళనాడు రాష్ట్రం వెల్లూరు జిల్లా పేర్వార్ వట్టం గ్రామానికి చెందిన సింగారం మూడు నెలలుగా స్థానిక గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపులో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం క్యాంపు కార్యాలయం పరిధిలో అతను ఫోన్ మాట్లాడుతుండగా గాలిన వాన వచ్చింది. ఇంతలో పక్కనే పిడుగు పడడంతో అతడు కిందపడిపోయాడు. గమనించిన క్యాంపులోని సిబ్బంది మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సింగారం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు సమాచారం.

అథ్లెటిక్స్ ఆణిముత్యాలు..

● జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు

● ఒలింపిక్స్‌లో ప్రాతినిథ్యం వహించడమే లక్ష్యం

కమలాపూర్ : వీరికి చిన్నప్పటి నుంచి ఆటలంటే అమితమైన ప్రేమ. ఇందుకు ఎక్కడ పోటీలు జరిగినా అక్కడకు వెళ్లి పాల్గొనే వారు. మామూలుగా పాల్గొనడమే కాకుండా కచ్చితంగా పతకాలు సాధించేవారు. అలా అని చదువును ఎక్కడా నిర్లక్ష్యం చేయలేదు. ఇందులోనూ ప్రతిభ చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ, మధ్య తరగతి కుటుంబాల్లో పుట్టి పెరిగి చదువుతో పాటు తల్లిదండ్రులు, కోచ్‌ల సహకారంతో అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నారు. భారతదేశం తరఫున ఒలింపిక్స్‌లో ప్రాతినిథ్యం వహించాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతూ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న యువ అథ్లెట్లపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

16 పతకాలు సాధించిన సంగీత..



తల్లిదండ్రులతో మౌటం సంగీత

కమలాపూర్‌కు చెందిన నిరుపేద మత్స్య కార్మిక కుటుంబీకులు మౌటం శ్రీనివాస్–రమ దంపతుల కూతురు సంగీత పాఠశాల స్థాయిలోనే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, హ్యామర్ త్రోలో ప్రతిభ కనబరుస్తోంది. అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఆమె ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు, పీఈటీలు ప్రోత్సహించి శిక్షణ ఇచ్చారు. అంతే అప్పటి నుంచి సంగీత అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటుకుంటూ పతకాల వేట సాగిస్తోంది. 2022లో అండర్–16 డిస్కస్ త్రో జిల్లా స్థాయిలో వెండి పతకం, అదే ఏడాది నవంబర్‌లో కాంస్య పతకం, 2023లో అండర్–18లో జిల్లా స్థాయిలో బంగారు పతకం సాధించింది. 2022లో అండర్–16 జావెలిన్ త్రోలో జిల్లా స్థాయిలో రెండు వెండి పతకాలు సాధించింది. 2023లో అండర్–18లో రాష్ట్రస్థాయి హ్యామర్ త్రోలో కాంస్య పతకం, 2024లో జిల్లా స్థాయిలో నాలుగు పతకాలతో పాటు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో అండర్–18 జావెలిన్ త్రోలో వెండి పతకం, డిస్కస్ త్రోలో కాంస్య పతకం సాధించింది. 2023లో పట్నాలో జరిగిన జాతీయ స్థాయి అండర్–16 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ డిస్కస్ త్రోలో ప్రశంస పత్రం అందుకుంది.

జాతీయ స్థాయి పోటీలకు సాయిరాం ..



సెలక్షన్ కమిటీ రాష్ట్ర అధికారులతో సాయిరాం

కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం మైలారం గ్రామానికి చెందిన సింగిరెడ్డి సాయిరాం ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరుగనున్న అండర్–18 విభాగం షాట్‌పుట్ జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడు. సాయిరాం ఇప్పటి వరకు మూడు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 2024 ఆగస్టులో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో షాట్‌పుట్, డిస్కస్ త్రోలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

రన్నింగ్, లాంగ్ జంప్‌లో శివప్రసాద్ ప్రతిభ..



గిరవేన శివప్రసాద్

భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం అంకుశాపూర్‌కు చెందిన వ్యవసాయ కుటుంబీకులు గిరవేన చంద్రమౌళి–స్వప్న దంపతుల కుమారుడు శివప్రసాద్ కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. 8వ తరగతి నుంచి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరుస్తున్న శివప్రసాద్ 2022లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించాడు. 2024లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పథకం అందుకున్నాడు. లాంగ్ జంప్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై 5వ స్థానంలో నిలిచాడు.

15 వరకు కేయూ దూరవిద్య ప్రవేశాల గడువు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూరవిద్యాకేంద్రం (ఎస్డీఎల్‌సీఈ)లో డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ఓరియెంటేషన్ కోర్సుల్లో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశాల గడువు ఈనెల 15 వరకు ఉందని డైరెక్టర్ ఆచార్య వి.రాంచంద్రం తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ, బీఎల్ఐఎస్‌సీ, పీజీ కోర్సుల్లో ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,హెచ్‌ఆర్‌ఎం, హిస్టరీ, సోషియాలజీ, రూరల్‌డెవలప్‌మెంట్, సోషల్‌వర్క్, ఎంకామ్, జర్నలిజం, అండ్ మాస్‌కమ్యూనికేషన్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, ఎంఎల్ఐసీ కోర్సులున్నాయని పేర్కొన్నారు. డిప్లొమా కోర్సుల్లో కంప్యూటర్ అప్లికేషన్స్ గైడెన్స్అండ్ కౌన్సిలింగ్, యోగా, సర్టిఫికెట్ కోర్సుల్లో సీఎల్ఐసీ, మిమిక్రీలో ఓరియంటేషన్ కోర్సు ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో లేదా దూరవిద్యాకేంద్రంలో నేరుగా చలాన్ ద్వారా ఫీజులు చెల్లించి ప్రవేశం పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0870–2461480, 0870–2461490 నంబర్లలో సంప్రదించాలన్నారు. అలాగే సంబంధిత కేయూ ఎస్‌డీఎల్‌సీఈ వెబ్‌సైట్‌లోను వివరాలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

విహారం.. విషాదం

● జలపాతంలో మునిగి విద్యార్థి మృతి

● కొంగాల సమీపంలోని దుసపాటి లొద్దిలో ఘటన



అభినయ్ మృతదేహం

వాజేడు: విహారం.. విషాదమైంది. మండలంలోని కొంగాల సమీపంలో ఉన్న దుసపాటి లొద్ది జలపాతంలో మునిగి ఓ విద్యార్థి మృతి చెందాడు. వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ కథనం ప్రకారం.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలకు చెందిన బండారి శ్రీనివాస్ కుమారుడు అభినయ్(18) మరో ఆరుగురు మిత్రులతో కలిసి శనివారం సాయంత్రం ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతానికి వచ్చారు. అప్పటికే బొగత జలపాతం ప్రవేశం మూసివేయడంతో చీకుపల్లిలోనే బస చేశారు. ఆదివారం ఉదయం కొంగాల సమీపంలోని దుసపాటి లొద్దిని చూడడం కోసం వెళ్లారు. ఈ సమయంలో అటవీ శాఖ సిబ్బంది లేకపోవడంతో నేరుగా అక్కడికి వెళ్లారు. జలపాతంలోకి దిగగానే అభినయ్ నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో వారు వాజేడు ఎస్సై హరీశ్‌కు సమాచారం అందించారు. గజ ఈతగాళ్లతో గాలించగా అభినయ్ మృతదేహం లభించింది. విషయాన్ని పోలీసులు వెంటనే తల్లిదండ్రులకు తెలిపారు. అభినయ్ అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ ఈఈఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

నిషేధించినా ఇతర దారుల్లో సందర్శన..

దుసపాటి లొద్ది జలపాతం వద్ద ఎలాంటి సౌకర్యాలు, రక్షణచర్యలు లేకపోవడంతో అటవీ శాఖ సందర్శనను నిలిపి వేసింది. అయితే కొందరు ఇతర దారుల్లో వెళ్లి జలపాతాన్ని సందర్శిస్తున్నారు. జాతీయ రహదారి నుంచి కొంగాలకు వెళ్లే దారిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కర్రలను అడ్డుగా కట్టి ఎవరిని అనుమతించడం లేదు. కాపలా ఉన్న ప్రదేశం నుంచి కాకుండా పొలాల గుండా మరోదారిలో కొందరు, అటవీ శాఖ సిబ్బంది కాపలాకు రాని సమయంలో కొందరు, తమది కొంగాల గ్రామమని మనికొందరు జలపాతానికి వెళ్లి వీక్షిస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టకపోవడంతోనే ఇలా జరుగుతుందని ప్రజలు అనుమానిస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది కాపలా కోసం అక్కడికి రాక ముందే వెళ్లడంతో అభినయ్ మృతి చెందినట్లు స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

అత్తకు కోడలి వేధింపులు!

● ఇంటి నుంచి గెంటివేసే యత్నం

● ఐదేళ్ల నుంచి ఇలాగే బెదిరింపులు

● వరంగల్ ఆర్డీఓ ఆదేశాలు బేఖాతర్



ఆర్డీఓ ఆదేశాల ప్రతులు చూపుతున్న బాధితురాలు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన 64 ఏళ్ల వృద్ధురాలు గోనె సరోజన తన కోడలి వేధంపులతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. సరోజన భర్త చనిపోగా.. ఇంటి నుంచి గెంటివేస్తానంటూ కోడలు ఐదేళ్ల నుంచి వేధిస్తోంది. ఈ విషయమై ఆదివారం బాధితురాలు ధర్మారంలో విలేకర్లకు తన గోడు వెల్లబోసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గోనె సరోజనకు ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉంది. సరోజన భర్త చేరాలు మృతి చెందగా కష్టం చేసి ఇద్దరు కుమారులకు వేర్వేరు ఇళ్లు నిర్మించి ఇచ్చింది. పెద్ద కుమారుడు మహేందర్ గతంలో చనిపోగా అతడి భార్య సంధ్య, ఆమె ఇద్దరు కూతుళ్లు అదే ఇంట్లో ఉంటున్నారు. కొంత కాలంగా అత్త సరోజనను కోడలు సంధ్య వేధింపులకు గురి చేస్తూ ఇంటి నుంచి వెళ్లగొడతానని, పలు మార్లు ఇంటికి తాళం వేసింది. ఈ విషయమై బాధితురాలు వరంగల్ ఆర్డీఓకు ఫిర్యాదు చేయగా ఆమెకు రక్షణ కల్పించాలంటూ గతేడాది ఏప్రిల్ 15న ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై బాధితురాలు గీసుకొండ పోలీసులను కలిసి పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పెద్దగా స్పందించలేదు. బాధితురాలి గోడు విని ఆమెకు మద్దతు పలికిన గ్రామస్తులు, పెద్దమనుషులపై సంధ్య గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, తనను వేధింపులకు గురి చేస్తున్న తన కోడలి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరింది. వృద్ధాప్యంలోనూ కూలీ పని చేసుకుంటూ బతుకుతున్నానని, వేధింపులతో ఆత్మహత్య చేసుకుంటానని ఆ వృద్ధురాలు కన్నీరుమున్నీరుగా విలపించింది.

ప్రభుత్వానికి ఉద్యమకారుల ఆకాంక్ష వివరిస్తా

● ఎమ్మెల్సీ కోదండరాం



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కోదండరాం

నర్సంపేట : తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను రాష్ట్ర ప్రభుత్వానికి వివరించి నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆదివారం పట్టణంలోని సిటిజన్స్ క్లబ్‌లో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ జావేద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమకారుల కృషిని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో నర్సంపేట రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందన్నారు. ఉద్యమ సమయంలో నర్సంపేటలో అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 736 రోజులు దీక్షలు చేపట్టడం అభినందనీయమన్నారు. కాగా, అంతకుముందు పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ, నిట్ ప్రొఫెసర్ రమాదేవి, అంబటి శ్రీనివాస్, రామ్మూర్తి, అరుణ, జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్లు ఉదయ్‌సింగ్, గోపాల్, జయుడు, ప్రజాసంఘాల నాయకులు ప్రణయ్‌దీప్, వాసునాయక్, జగన్, రవి, మహబూబ్ అలీ పాల్గొన్నారు.

కోదండరాంకు వినతులు..

బీసీలకు జనాభా దామాషా ప్రకారం 50శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జి సోల్తి సారయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారపు నరేంద్ర, డివిజన్ ప్రధాన కార్యదర్శి సాంబరాతి మల్లేశం .. ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్, సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏఐసీటీ యూ జిల్లా అధ్యక్షుడు మాషుక్ వినతిపత్రం అందజేశారు. నర్సంపేటలోని మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో ఉద్యోగావకాశాలు కల్పించాలని పీఓడబ్ల్యూ, పీవైఎల్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో కోదండరాంకు వినతిపత్రం అందజేశారు.

రూ. 24.7 లక్షల విలువైన క్రాకర్స్ పట్టివేత



టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న క్రాకర్స్

పర్వతగిరి: అక్రమంగా నిల్వ చేసిన క్రాకర్స్‌ను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కొత్త రవితేజ అక్రమంగా క్రాకర్స్ నిల్వ చేశారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆదివారం గోదాంపై దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో రూ.24. 7 లక్షల విలువైన క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకుని కొత్త రవితేజను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ దాడుల్లో టాక్స్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్, ఎస్సై వి.దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకు మరణం తట్టుకోలేక తల్లి మృతి

● మూడు రోజుల వ్యవధిలోనే ఇద్దరూ కన్నుమూత

● తానేదార్‌పల్లిలో విషాదఛాయలు



వెంకటమ్మ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు మృతి చెందడంతో మనోవేదనకు గురైన తల్లి గుండెపోటుతో మరణించింది. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని తానేదార్ పల్లిలో జరిగింది. మూడు రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో కొడుకు, తల్లి మృతి చెందడంతో కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు ఆకుల శ్రీనివాస్(55) అప్పుల బాధతో ఈనెల 3న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే శ్రీనివాస్ మృతిచెందిన రోజు నుంచి అతడి తల్లి వెంకటమ్మ(74) మనోవేదనకు గురవుతోంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, చిన్న కుమారుడైన శ్రీనివాస్‌పై ప్రేమ ఎక్కువ ఉండేది. శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం జీర్ణించుకోలేక మూడు రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటమ్మ శనివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందింది. మూడు రోజుల వ్యవధిలోనే కొడుకు, తల్లి మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ట్రాక్టర్ తిరగబడి యువకుడు ..



హుస్సేన్ (ఫైల్)

ములుగు రూరల్: రివర్స్ తీస్తున్న క్రమంలో ట్రాక్టర్ తిరుగబడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని దేవగిరిపట్నంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తేజవత్ హుస్సేన్(28) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రైతు సానికొమ్ము సంజీవరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్‌పై ఎరువుల బస్తాలు వేసుకుని గ్రామానికి చెందిన వాంకుడోత్ దశరథ్‌తో కలిసి అన్నపల్లి శివారు చిర్రకుంటకు వెళ్లాడు. బస్తాలు పంట పొలం వద్ద దింపారు. ఈ క్రమంలో దశరథ్ ట్రాక్టర్ దిగి ఉన్నాడు. హుస్సేన్ చెరువు కట్టపై ట్రాక్టర్ రివర్స్ తీస్తున్న క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ టాప్‌కు ఇంజన్‌కు మధ్యలో హుస్సేన్ ఇరుక్కుని మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి ద్వాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కాగా, హుస్సేన్ మృతితో తల్లి, బంధువుల రోదనలు మిన్నంటాయి.

చెరువులో పడి మరోయువకుడు..

రఘునాథపల్లి: పెద్దనాన్న కుమారుడి దశదిన కర్మ కార్యక్రమానికి వచ్చి హైదరాబాద్‌లోని కొత్తపేట అంబేడ్కర్ నగర్‌కు చెందిన గంగాధరి పవన్ (28) చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని మల్లంపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బంధువు గంగాధరి శ్రీనివాస్ దశదిన కర్మకు పవన్ హాజరయ్యారు. కార్యక్రమ అనంతరం బంధువులతో కలిసి గ్రామంలోని లచ్చుము చెరువులోకి స్నానం చేసేందుకు వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో బంధువులు చెరువు వద్దకు వెళ్లి చూశారు. పవన్ మృతదేహం చెరువులోని ముల్లకంపకు చిక్కుకుని కనిపించింది. ఈ ఘటనపై మృతుడు తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

సూపరింటెండెట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలి

● పీఆర్ ఎంఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి



ఎన్నికైన హనుమకొండ జిల్లా నూతన కమిటీ, రాష్ట్ర నాయకులు

హన్మకొండ: పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న సూపరింటెండెంట్లకు ప్రభుత్వం గెజిటెడ్ హోదా కల్పించాలని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని జెడ్పీ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన అసోసియేషన్ హనుమకొండ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నామని, ప్రధానంగా పర్యవేక్షకులకు గెజిటెడ్ హోదా కల్పన, పదోన్నతుల ప్రక్రియ వేగవంతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సాంఘిక భద్రత కింద ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వారికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందకుమార్ మాట్లాడుతూ అడహక్ ప్రమోషన్ పొందిన సీనియర్ సహాయకులను రెగ్యులరైజ్ చేసేందుకు రాష్ట్రస్థాయిలో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అసోసియేషన్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడం రవిప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా చాట్ల రవికుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఇ.శ్రీనివాసరావు ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.సునీల్ కుమార్, కె.శ్రీనివాస్, బి.సత్యనారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా పి.అర్పిత, వి.పల్లవి, జి.రమేశ్, జి.రజనీదేవి, కోశాధికారిగా ఎండి.ఖాజా ఇక్బాల్, జాయింట్ కోఆర్డినేషన్ కమిటీ మెంబర్‌గా ఎ.వసంత రామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం.కరుణకుమారి, సీహెచ్.వేణుగోపాల్, పి.కళాజ్యోతి, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం.పూర్ణచందర్, డి.ప్రవీణ్, పి.జయరాం, బి.వెంకటేశ్వర్లు, ఈసీ మెంబర్లుగా బి.ప్రదీప్, కె.శ్రీనివాసరావు, ఎండి.అబ్దుల్ రఫీక్, ఇ.భాగ్యలక్ష్మి, కె.చంద్రశేఖర్, ఎండి.ఇఫ్తార్ మహమ్మద్ ఎన్నికయ్యారు. సమావేశంలో జనగామ, ములుగు, వరంగల్, భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు చింత విక్రం, జి.అనిల్, జి.యుగంధర్, విజయపాల్ రెడ్డి, నాయకులు మోజెస్ ప్రవీణ్ కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

కేంద్ర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారనికి ఎల్లప్పుడూ ముందుంటానని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ 38వ వార్షిక మహాసభ జరిగింది. ఏఐఐఈఏ వరంగల్ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీహరి యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. కడియం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని ఈ మహాసభను ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వంలో దేశంలో పేదలు అలాగే ఉన్నారని, ధనవంతులు మాత్రం మరింత ధనవంతులుగా మారుతున్నారన్నారని విమర్శించారు. ఎల్ఐసీ షేర్లను అమ్మడం సంస్థను ప్రైవేట్ పరం చేయడంలో భాగమేనన్నారు. బీజేపీ.. ప్రజా, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని, పేదల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. యూనియన్ సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు పి.సతీశ్ మాట్లాడుతూ జీవిత బీమా వ్యాపారంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆహ్వానించడంతో దేశంలో 24 ప్రైవేట్ బీమా కంపెనీలు స్థాపించారన్నారు. అయినా ప్రైవేటు కంపెనీలను దరిదాపులోకి రానీకుండా ఎల్ఐసీ ప్రగతి పథంలో పరిగెడుతోందన్నారు. మార్కెట్ లీడర్‌గా చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంటుందన్నారు. రాజకీయ నిర్ణయాలు మనకు ప్రతికూలంగా ఉంటున్న ఈ క్రమంలో సవాళ్లను తిప్పికొట్టడానికి ఉద్యోగులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సభలో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుబ్రమణియన్, యూనియన్ వరంగల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్, నాయకులు బి.ఎస్.రవి, ఆర్.శ్రీనివాసన్, జి.భాస్కర్, పులి సుధాకర్, కె.నాగభూణం, ఎ.చంద్రశేఖర్, కె.మాధవి, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఎల్ఐసీ వరంగల్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.శ్రీహరి, ఉపాధ్యక్షుడిగా జె.తిరుమల్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులుగా కె.నాగభూషన్, ఎం.చంద్రశేఖర్, కోశాధికారిగా రేష్మ ఎన్నికయ్యారు.

తల్లులకు తీరని శోకం

కళ్లెదుటే విగతజీవులుగా కన్నబిడ్డలు

● పొలం పనులు చేస్తుండగా పడిన పిడుగు

● ఇద్దరు అక్కడికక్కడే మృతి

● అస్వస్థతకు గురైన మరో ఐదుగురు

● వెంకటాపురంలో విషాదం



శ్రావణి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి ఇందిర, అన్న శ్రీకాంత్.. రాజు మృతదేహం వద్ద సొమ్మసిల్లి పడిపోయిన తల్లి కోమల

ఐనవోలు: అప్పటిదాకా ఎండ దంచికొట్టింది. మధ్యాహ్నం 3 తర్వాత ఒక్కసారిగా వాతావరణం చలబడింది. ఆ వెంటనే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతో పంట క్షేత్రాల్లో పనిచేస్తున్న వారంతా పశువుల కోసం వేసిన రేకుల షెడ్డులోకి చేరుకున్నారు. ఒక్కసారిగా పిడుగుపడింది. షెడ్డులో ఉన్న ఏడుగురు కింద పడిపోయారు. అందులో ఐదుగురు తేరుకుని లేచి చూడగా.. అప్పటికే ఇద్దరు చనిపోయారు. కళ్లెదుటే కన్నబిడ్డలు విగత జీవులుగా పడి ఉండడంతో ఆ తల్లులు దిక్కులు పెక్కటిల్లేలా ఏడ్చారు. ఈ విషాద ఘటన ఐనవోలు మండలం వెంకటాపురంలో చోటుచేసుకుంది.

గుండెలవిసేలా రోదిస్తూ..

ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పిడుగు పడడంతో వెంకటాపురం గ్రామంలోని వేర్వేరు కుటుంబాలకు చెందిన అవివాహితులు దౌతు బాజి శ్రావణి(17), కూకట్ల రాజు(24) మృతి చెందారు. శ్రావణి ఇంటర్ చదువుతోంది. ఆమె తండ్రి రాంబాబు గతంలో మృతి చెందగా.. అన్న శ్రీకాంత్ ఉన్నాడు. వీరికున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ తల్లి ఇందిర కుటుంబాన్ని పోషిస్తోంది. పొలం పనులకు ఆసరాగా ఉంటుందని శ్రావణిని ఆమె వెంట తీసుకెళ్లింది. కానీ.. పిడుగుపాటు తన బిడ్డ భవిష్యత్‌నే మింగేసిందని ఇందిర కన్నీరుమున్నీరైంది. అదేవిధంగా కూకట్ల రాజుకు ముగ్గురు అక్కలు ఉండగా.. వారికి వివాహాలయ్యాయి. రాజు తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవలే ఇల్లు కట్టుకున్నాడు. త్వరలో అతడికి పెళ్లి చేయాలని తల్లిదండ్రులు కోమల, అయిలయ్య సంబంధాలు చూస్తున్నారు. కానీ.. ఇంతలోనే పిడుగు రూపంలో వంశాంకురం మృతి చెందడంతో గుండెలవిసేలా రోదించారు. కుమారుడి మృతి చూసి కోమల షాక్‌కు గురైంది.

గ్రామంలో విషాదం

శ్రావణి, రాజు మృతితో వెంకటాపురంలో విషాదం నెలకొంది. మృతులిద్దరూ కలివిడిగా ఉండేవారని స్థానికులు పేర్కొంటున్నారు. 11 కేవీ వైర్ల సమీపంలో ఉండడమే పిడుగుపాటుకు కారణంగా గ్రామస్తులు చెబుతున్నారు. ఈవిషయం తెలియగానే జఫర్‌గఢ్ ఎస్సై రాంచరణ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.